సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



నిమజ్జనం.. జర భద్రం

వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలో సరైన జాగ్రత్తలు పాటించాలని పోలీసులు, అధికారులు సూచిస్తున్నారు. IIలో



ఆలస్యమే కలిసొచ్చింది!

స్థానిక ఎన్నికల నిర్వహణలో జాప్యం కొందరికి కలిసొచ్చింది. గతంలో వేటు పడిన వారికి మళ్లీ పోటీ చేసే అవకాశం లభించింది. IIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31°/ 24°

జిల్లాలో గురువారం ఆకాశం కొంత మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్‌: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన భాస్కర్‌రామ్‌ రూ.2లక్షల చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకోగా, అధికారులు ఆయనకు ప్రసాదం, స్వామివారి జ్ఞాపిక అందజేశారు.

అధికారుల ఆట విడుపు !

టెన్నిస్‌ ఆడిన ఐటీడీఏ పీఓ, హౌసింగ్‌ ఎండీ



క్రీడాకారులతో పీఓ రాహుల్‌, హౌసింగ్‌ ఎండీ గౌతమ్‌

పాల్వంచరూరల్‌ : నిత్యం విధి నిర్వహణలో బిజీగా గడిపే ఇద్దరు ఐఏఎస్‌ అధికారులు ఆటవిడుపుగా కాసేపు టెన్నిస్‌ ఆడారు. భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌, గృహ నిర్మాణ శాఖ ఎండీ వి.పి.గౌతమ్‌ చండ్రుగొండ మండలం బెండలపాడులో సీఎం రేవంత్‌రెడ్డి సభా కార్యక్రమం అనంతరం తిరుగు ప్రయాణంలో పాల్వంచ శ్రీనివాసకాలనీలోని మినీ స్టేడియం వద్ద ఆగారు. బుధవారం రాత్రి కొందరు టెన్నిస్‌ ఆడుతుండగా వారు కూడా సరదాగా కాసేపు లాన్‌ టెన్నిస్‌ ఆడారు. వారి వెంట టెన్నిస్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు, ఒలింపిక్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ గంగిరెడ్డి యుగంధర్‌ ఉన్నారు.

మళ్లీ 'మొదటి'కొచ్చిన గోదావరి

భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ఇలా..

భద్రాచలంటౌన్‌ : భద్రాచలం వద్ద గోదావరి నది ప్రవాహం మళ్లీ పెరుగుతోంది. ఎగువ ప్రాజెక్టుల నుంచి వరద నీరు భారీగా వస్తుండగా బుధవారం రాత్రి 9.50 గంటలకు నీటి మట్టం 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 11 గంటలకు 43.30 అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. బుధవారం ఉదయం 9 గంటల వరకు తగ్గుతూ వచ్చిన నీటి ప్రవాహం సాయంత్రానికి ఒక్కసారిగా పెరిగింది. మరోసారి గోదావరి ఉప్పొంగుతుండడంతో ఏజెన్సీ వాసుల్లో భయం పట్టుకుంది. కాగా, ఈ వర్షాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు మూడు సార్లు మొదటి ప్రమాద హెచ్చరిక, రెండుసార్లు రెండో ప్రమాద హెచ్చరిక జారీ కావడం గమనార్హం.

పది రోజుల్లో ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యేల నుంచి విజ్ఞాపనలు అందాయి..

- త్వరలోనే వారితో మంత్రుల భేటీ
- ఆపై ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం
- దామరచర్ల సభలో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి





అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, శ్రీహరి, ఎంపీ బలరాం, ఎమ్మెల్యేలు ఆదినారాయణ, పాయం, (ఇన్‌సెట్‌) మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన తనకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు పలు సమస్యలపై విజ్ఞాపన పత్రాలు అందజేశారని, వీటన్నింటిపై పది రోజుల్లో ప్రభుత్వ పరంగా దృష్టి సారిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. చండ్రుగొండ మండలం బెండాలపాడులో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం అనంతరం దామరచర్లలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగం ఆయన మాటల్లోనే..

కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, వైరా, సత్తుపల్లి, పినపాక, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల సమస్యలు, పనులపై వినతిపత్రాలు ఇచ్చారు. పది రోజుల్లో వారితో మాట్లాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెప్పా. వినతిపత్రాలు, ప్రతిపాదనలపై జిల్లా అధికారులతో చర్చించి అన్ని సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల వద్దే కీలక శాఖలు ఉన్నాయి.

సారపాకలో సన్న బియ్యం భోజనం..

గతంలో రేషన్‌కార్డులపై పేదలకు దొడ్డుబియ్యం పంపిణీ చేసేవారు. ఆ బియ్యంతో అన్నం తినలేక చాలా మంది అమ్ముకునే వారు. కానీ మా ప్రభుత్వం వచ్చాక పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించాం. సారపాకలో సామాన్యుడి ఇంట్లో భోజనం చేయడానికి వెళ్లినప్పుడు రేషన్‌కార్డుపై వచ్చిన బియ్యంతోనే అన్నం వండమని చెప్పాం. ఏమైనా తప్పులు ఉంటే సరిదిద్దుకుంటామని చెప్పా. కానీ ఆ ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు జూబ్లీహిల్స్‌లోని మా ఇంట్లో, శీనన్న(పొంగులేటి శ్రీనివాసరెడ్డి) ఇంట్లో అన్నం తిన్నట్టే అనిపించింది. సన్నబియ్యంతో అన్నం తింటున్నప్పుడు సామాన్యుడి కళ్లలో కనిపించే ఆనందం కోటి రూపాయలు ఇచ్చినా రాదు.

ఆత్మగౌరవంతో బతికేలా

తొలిదశ తెలంగాణ ఉద్యమం పాల్వంచలో ప్రారంభమై తెలంగాణకు దిశాదశ చూపించింది. ఏ సమస్య వచ్చినా ముందుగా స్పందించేది ఖమ్మం జిల్లానే. ఈ జిల్లా వాసులు సమయస్ఫూర్తితో వ్యవహరిస్తారు. ఇక్కడ గూడేలు, తండాల వారికి తల్లితో సమానంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీపై గౌరవం ఉంది. అందుకే పేదల సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ల పథకం నిజం చేస్తోంది. పేదలు సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు గడిచిన పదేళ్లుగా ఎదురుచూసి నిరాశ చెందారు. ఇప్పుడు నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రంలో 4.50లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం. అశ్వారావుపేటకు మాత్రం ఏకంగా 4,500 ఇళ్లు ఇచ్చాం. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీదే.

2–30 గంటల పాటు..

షెడ్యూల్‌ ప్రకారం మధ్యాహ్నం 2:20 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి చండ్రుగొండకు రావాల్సి ఉంది. అయితే మహబూబ్‌నగర్‌ జిల్లాలో పర్యటన కారణంగా మధ్యాహ్నం 3 : 40 గంటలకు చండ్రుగొండకు చేరుకున్నారు. తొలుత బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్నాక పైలాన్‌ ఆవిష్కరించి ఇందిరమ్మ లబ్ధిదారులతో మాటామంతీ నిర్వహించారు. ఆ తర్వాత దామరచర్లలో బహిరంగ సభాస్థలికి చేరుకున్నారు. అక్కడ 29 నిమిషాల పాటు ప్రసంగించిన సీఎం.. సాయంత్రం 6 : 10 గంటలకు తిరుగు పయనమయ్యారు. మొత్తంగా రెండున్నర గంటల పాటు జిల్లాలో సీఎం పర్యటన కొనసాగింది.



ఇందిరమ్మ ఇళ్ల పైలాన్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన మంత్రులు, ఎమ్మెల్యేలు



బచ్చల నర్సమ్మ ఇంట్లో పూజ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



బచ్చల రమణ కుటుంబసభ్యులతో సీఎం రేవంత్‌

సీఎం సభ సైడ్‌లైట్స్‌...

- మధ్యాహ్నం 3.48 : చండ్రుగొండ హెలీపాడ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌ చేరుకుంది.
- 3.50 : మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే పాయం సీఎంకు స్వాగతం పలికారు.
- 3.53 : హెలీపాడ్‌ నుంచి బెండాలపాడుకు కాన్వాయ్‌లో సీఎం బయలుదేరారు. సీఎం కారులోనే మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కూర్చున్నారు.
- 4.08 : బెండాలపాడులోని ఇందిరమ్మ ఇళ్ల వద్దకు చేరుకున్నారు.
- 4.10 : ఇందిరమ్మ ఇంటి రిబ్బన్‌ కట్‌ చేసి, గృహ ప్రవేశం చేశారు.
- 4.12 : ఇందిరమ్మ ఇంటి వద్ద సీఎం కొబ్బరిచెట్టు నాటారు.
- 4.20 : గ్రామదేవతకు పూజలు చేశారు.
- 4.24 : ఇందిరమ్మ పైలాన్‌ ఆవిష్కరించారు.
- 4.27 : బెండాలపాడు నుంచి దామరచర్లలోని సభా వేదిక వద్దకు కాన్వాయ్‌లో బయలుదేరారు.
- 4.45 : దామరచర్ల సభా వేదిక వద్ద కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.
- 4.46 : ఇందిరమ్మ ఇళ్ల నమూనాను బెండాలపాడుకు చెందిన లబ్ధిదారులు సీఎంకు అందించారు.
- 4.47 : తెలంగాణ తల్లి గీతాన్ని ఆలపించి, బహిరంగ సభ ప్రారంభించారు.
- 5.45 : రేవంత్‌రెడ్డి ప్రసంగం ప్రారంభం
- 6.14 : ముగిసిన సీఎం రేవంత్‌ ప్రసంగం

– అశ్వారావుపేటరూరల్‌

వరుణుడు కరుణించాడు..

ములకలపల్లి : సీఎం సభకు వరుణదేవుడు కరుణించాడు. మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురవగా సభా ప్రాంగణం బురదమయం కావడం, రహదారులన్నీ చిత్తడిగా మారడంతో అధికారులు, కాంగ్రెస్‌ కార్యకర్తలు ఆందోళనకు గురయ్యారు. బుధవారం ఉదయం కూడా చిరుజల్లులు కురిసి, కారుమబ్బులు కమ్ముకోవడంతో టెన్షన్‌ వాతావరణం నెలకొంది. ఇప్పటికే రెండు పర్యాయాలు కార్యక్రమం వాయిదా పడగా మరోసారి కూడా ఏం జరుగుతుందోనని భయపడ్డారు. అయితే సభ సమయానికి వాతావరణం అనుకూలించడంతో సభ విజయవంతమైంది. బెండాలపాడులో గృహప్రవేశ సమయంలో రేవంత్‌రెడ్డి లబ్ధిదారులతో మాట్లాడుతూ చిరుజల్లులు కురిసినా, వెంటనే నిలిచిపోయాయని, భవవంతుడి ఆశీస్సులు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

ఫలించిన 'ఖాకీ'ల శ్రమ

సీఎం సభకు 1,200 మందికి పైగా పోలీసులు బందోబస్తు నిర్వహించడంతో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు లేకుండా సభ విజయవంతం కావడంతో ఖాకీల శ్రమ ఫలించినట్టు యింది. భారీగా బస్సులు వచ్చినా, నిర్ణీత ప్రదేశాలకు తరలించారు. పెద్దగా ట్రాఫిక్‌ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్త వహించారు.

పేదల ఆత్మగౌరవమే లక్ష్యం

- ఎంత ఖర్చయినా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- మంత్రి పొంగులేటి వెల్లడి

అశ్వారావుపేట: రాష్ట్రంలో పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. చండ్రుగొండ మండలం దామరచర్లలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పేదవాడిని చీడపురుగులా చూసిందని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. ప్రస్తుతం ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తున్నామని చెప్పారు. మొదటి సంవత్సరమే రాష్ట్రంలో నాలుగున్నర లక్షల ఇళ్లు మంజూరు చేశామని, వచ్చే రెండున్నరేళ్లలో మరో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. అశ్వారావుపేట నియోజకవర్గానికి 25వేల ఇళ్లు అదనంగా కేటాయిస్తామన్నారు. తాము పదవులు అడగలేదని, సీఎం రేవంత్‌రెడ్డి పిలిచి పదవులివ్వడంతో పాటు ఆడపడుచులకు ఇళ్లు ఇవ్వడమే కాక స్వయంగా జిల్లాకు వచ్చి శంకుస్థాపనలు, గృహప్రవేశాలు చేశారని వివరించారు. జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. నాడు దివంగత ముఖ్యమంత్రి పాదయాత్ర చేసి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తే, నేడు రేవంత్‌రెడ్డి పాదయాత్రతో కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తెచ్చారని అన్నారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ పార్టీని బతికించి అధికారంలోకి తెచ్చిన టైగర్‌ రేవంత్‌ రెడ్డి అని కొనియాడారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కల నెరవేరిన రోజిది అన్నారు. భద్రాచలం, ఇల్లెందు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలు, గృహ ప్రవేశాలు ఈ జిల్లాలోనే చేయడం హర్షణీయమని అన్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ఈ రోజు తన జన్మలో మరిచిపోలేనిదని అన్నారు. బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు కార్యక్రమం రెండు సార్లు వాయిదా పడినా.. మూడోసారి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కొట్లాడాలన్నా.. పోరాడాలన్నా.. నిప్పుకణికల్లా ఆందోళన చేయాలన్నా తమకు సాటి రేవంత్‌ రెడ్డి అన్నారు. అందుకే ఆయనతో కలిసి ఉన్నామని చెప్పారు. సీతారామ నీళ్లు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు వచ్చేలా చూడాలని, కొత్తగూడెంలో 800 మెగావాట్ల విద్యుత్‌ ప్లాంట్‌ ఏర్పాటు చేయాలని కోరారు. నాడు వైఎస్సార్‌ భద్రాచలంలో పోడు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని.. నాటి, నేటి సీఎంలకు సారూప్యత ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్‌ ఎంపీ పోరిక బలరామ్‌నాయక్‌, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోత్‌ మాలోతు రాందాస్‌నాయక్‌, గృహ నిర్మాణ శాఖ ఎండీ వీపీ గౌతమ్‌, కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌, ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌, ట్రైనీ ఐఏఎస్‌ సౌరభ్‌శర్మ, హౌసింగ్‌ పీడీ రవీంద్రనాథ్‌, ఐడీసీ చైర్మన్‌ మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్‌, విద్యాచందన, భద్రాచలం సబ్‌ కలెక్టర్‌ మ్రిణాల్‌ శ్రేష్ఠ, ఎస్పీ రోహిత్‌రాజు, దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.



దామరచర్ల సభకు హాజరైన జనం

సంక్షేమానికి మారుపేరు వైఎస్సార్‌

సాక్షిప్రతినిధి, ఖమ్మం: దామరచర్లలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న సభలో వక్తలు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌.రాజశేఖరరెడ్డి నామస్మరణ చేశారు. ఆయన ముఖ్యమంత్రిగా అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రస్తావించినప్పుడల్లా అభిమానులు, ప్రజలు కేరింతలు కొట్టారు. సీఎం తన ప్రసంగంలో వైఎస్‌ ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తుండగా ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. వైఎస్‌ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించారని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌, ఉచిత విద్యుత్‌, రాజీవ్‌ ఆరోగ్యశ్రీ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కూడా తమ ప్రసంగాల్లో వైఎస్సార్‌ పేరు ప్రస్తావించారు. ఆయన సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడే సమయాన ప్రజలు ఈలలు, చప్పట్లతో తమ హర్షాతిరేకాలు వెలిబుచ్చారు.

ఇంజనీర్‌ ముఖ్యమంత్రి..

ఇందిరమ్మ ఇంటి నాణ్యతపై రేవంత్‌ ఆరా

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో రిబ్బన్‌ కటింగ్‌కే సీఎం రేవంత్‌రెడ్డి పరిమితం కాలేదు. ఇంజనీర్‌ తరహాలో ప్రతీ గోడను పరిశీలించారు. ఎలా నిర్మించారు.. నాణ్యత ఉందా లేదా అని ఆరా తీశారు. నిర్మాణ నాణ్యతపై సంతృప్తి చెందిన సీఎం, ఇదే తరహాలో ఇతర చోట్ల కూడా నిర్మించాలని అధికారులకు సూచించారు.

ఓనర్‌ రమణమ్మ గారూ.. రండి !

బెండాలపాడులో గృహప్రవేశం సమయంలో పూజ పూర్తయిన వెంటనే కొబ్బరికాయ కొట్టే సమయంలో 'ఇంటి ఓనర్‌ రమణమ్మ గారూ.. రండి' అని సీఎం రేవంత్‌రెడ్డి పిలిచారు. ఇల్లు బాగుందని మెచ్చుకున్నారు. ఈ సమయంలో రమణమ్మ కూతురు లిఖితను ఏం చదువుతున్నావని ప్రశ్నించగా.. డిగ్రీ చదువుతున్నానని బదులిచ్చింది. బాగా చదువుకోవాలని సీఎం సూచించారు. అనంతరం ఆ ఇంటి ఆవరణలో కొబ్బరి మొక్క నాటి.. ఇది ఎంత ఎదిగితే మీ కుటుంబం అంత పచ్చగా ఉంటుందన్నారు. అనంతరం కుటుంబంతో ఫొటో దిగారు.

ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా ?

'నర్సమ్మా.. అంతా సంతోషమేనా, ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా' అని రేవంత్‌రెడ్డి అడిగినప్పుడు 'మాకు అంతా మంచే జరిగింది సార్‌, మీరు రావడం మాకు చాలా సంతోషంగా ఉంది.. సీఎం సార్‌ వచ్చి మా ఇల్లు ఓపెన్‌ చేస్తారని అస్సలు అనుకోలేదు' అంటూ ఆమె బదులిచ్చింది. అనంతరం ఇంట్లో చాప మీద కూర్చున్నాక ఇంటిని పరిశీలిస్తూ పిల్లర్లు వేసి కట్టారా లేక గోడ మీదనే శ్లాబ్‌ వేశారా అని అడిగారు. పిల్లర్లు వేసి కట్టామంటూ నర్సమ్మ కుటుంబ సభ్యులు చెప్పగా.. అలా కడితేనే ఇల్లు బాగా ఆగుతుందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి మక్క గారెలు, పాయసం అందించారు. నర్సమ్మ ఒడిలో ఉన్న ఆమె మనుమరాలు పాన్యశ్రీ వెన్నెలకు సీఎం పాయసం తినిపించారు. 'నీ పేరేంటి, ఏ ఊరు' అని అడగగా.. ఆ చిన్నారి నమస్తే సార్‌ అంటూ బదులిచ్చింది. గృహ ప్రవేశం సందర్భంగా కుటుంబసభ్యులకు చీర, ప్యాంటు, షర్టులను ప్రభుత్వం తరఫున సీఎం అందించారు. తమ గ్రామానికి పీహెచ్‌సీ కావాలని సీఎంను కోరుదామనుకున్నామని, కానీ హడావుడిలో సాధ్యం కాలేదని ఇందిరమ్మ లబ్ధిదారులు తెలిపారు.



లిఖిత చదువు వివరాలు తెలుసుకుంటున్న సీఎం

భవిష్యత్‌కు బలమైన పునాది !

- చిన్నారులకు త్వరలో ప్రీప్రైమరీ తరగతులు
- తొలివిడతగా జిల్లాలోని 21 పాఠశాలల్లో అమలు
- టీచర్లు, ఆయాల నియామకానికి నోటిఫికేషన్‌
- నాలుగేళ్లు పైబడిన వారికి అడ్మిషన్లు..

కొత్తగూడెంఅర్బన్‌: నాలుగేళ్లు పైబడిన చిన్నారుల భవిష్యత్‌కు బలమైన పునాది వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రైవేట్‌, కార్పొరేట్‌ పాఠశాలల్లో బోధించే ఎల్‌కేజీ, యూకేజీ తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రీ ప్రైమరీ (పూర్వ ప్రాథమిక విద్య) తరగతులు అందుబాటులోనికి రానున్నాయి. రూ.వేల ఫీజులు చెల్లించి ప్రైవేట్‌ పాఠశాలలకు పంపించలేని తల్లిదండ్రులకు ఇదో వరంలా మారనుంది. జిల్లాలోని 21 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఈ ఏడాది నుంచే తరగతుల ప్రారంభానికి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నారుల విద్యాబోధనకు గాను ప్రత్యేకంగా టీచర్లు, ఆయాల నియామకానికి నోటిఫికేషన్‌ కూడా జారీ చేశారు. 18 – 44 ఏళ్ల వయసు గల స్థానిక మహిళలే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బోధకుల కనీస విద్యార్హత ఇంటర్‌మీడియట్‌గా, ఆయాలకు ఏడో తరగతిగా నిర్ణయించారు. వారి ఎంపిక కమిటీకి కలెక్టర్‌ చైర్మన్‌గా, డీఈఓ కన్వీనర్‌గా, అదనపు కలెక్టర్‌(రెవెన్యూ)తో పాటు కలెక్టర్‌ నామినేట్‌ చేసిన మరొకరు సభ్యులుగా ఉంటారు. బోధకులకు నెలకు రూ.8వేలు, ఆయాలకు రూ.6వేల చొప్పున గౌరవ వేతనం పది నెలల పాటు చెల్లించనున్నారు.

ఎంపికైన పాఠశాలలివే..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు తొలి విడతగా 21 పాఠశాలలను ఎంపిక చేశారు. వాటిలో ఆళ్లపల్లితో పాటు మండలంలోని పాతూరు ఎంపీపీఎస్‌, అశ్వారావుపేట మండలం కుడుములపాడు, ఐవీ ఎంప్లాయ్‌ కాలనీ, చండ్రుగొండ మండలం పోకలగూడెం, చర్ల మండలం పూసుగుప్ప, దమ్మపేట మండలం బాలరాజుగూడెం, దుమ్ముగూడెం మండలం గోవిందాపురం కాలనీ, గుండాల మండలం కొడవటంచ, జూలూరుపాడు మండలం కాకర్ల, లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్ల, మణుగూరు మండలం మామిడితోట గుంపు, పినపాక మండలం గోవిందాపురం, పాండురంగాపురం, ఉప్పాక, సింగిరెడ్డిపల్లి, టేకులపల్లి మండలం బేతంపూడి, తడికలపూడి స్టేషన్‌, రామచంద్రునిపేట, కొప్పురాయి, ఇల్లెందు మండలం రొంపేడు ఎంపీపీఎస్‌లు ఉన్నాయి.




ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు ఎంపికైన లక్ష్మీదేవిపల్లి పాఠశాల

ఒక్కో పాఠశాలకు రూ.1.70 లక్షలు..

నాలుగేళ్లు నిండిన చిన్నారులకు మాత్రమే ఇందులో ప్రవేశాలకు అవకాశం కల్పించారు. బోధనకు ఎల్‌కేజీ, యూకేజీ పుస్తకాలను ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఈ ప్రక్రియ ఆలస్యమైతే సంబంధిత మెటీరియల్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్‌ చేసుకుని బోధన సాగిస్తామని అధికారులు చెబుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు చిన్నారులకు ఆటపాటలతో కూడిన బోధన అందించనున్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజనంతో పాటు గంట సేపు నిద్రించేందుకు కూడా సమయం కేటాయించారు. ఎంపికైన పాఠశాలలకు రూ.1.70 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇందులో రూ.1.50 లక్షలు ఫర్నిచర్‌, పెయింటింగ్‌, బోధన పరికరాలు, ఇతర వస్తువుల కోసం ఖర్చు చేయనున్నారు. మిగితా రూ.20 వేలతో విద్యార్థులకు బూట్లు, యూనిఫామ్‌ కొనుగోలు చేస్తారు. 20 మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలకు అదనపు నిధులు మంజూరు చేస్తారు.

పేద పిల్లలకు అందుబాటులోకి..



ఇప్పటివరకు ప్రైవేట్‌ స్కూళ్లలో ఫీజులు చెల్లించే విద్యార్థులకు మాత్రమే ప్రీప్రైమరీ క్లాసులు వినే అవకాశం ఉండేది. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి రావడంతో పేద పిల్లలకు లబ్ధి చేకూరనుంది. చిన్నారులు ఆట, పాటలతో సరదాగా నేర్చుకునేలా పాఠ్య ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ తరగతులతో పిల్లల విద్యా పునాది బలపడటమే కాక సర్కారు స్కూళ్లలో అడ్మిషన్లు పెరగనున్నాయి.

– నాగలక్ష్మి, డీఈఓ

యూరియా పంపిణీలో ఇంత నిర్లక్ష్యమా ?

జూలూరుపాడు: యూరియా సరఫరాలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తమకు సరిపడా పంపిణీ చేయాలని కోరుతూ జూలూరుపాడు పీఏసీఎస్‌ కార్యాలయం ఎదుట రైతులు బుధవారం ఆందోళన చేశారు. కార్యాలయం లోపలికి వచ్చి షెట్టర్‌ మూసి అధికారులు, సిబ్బందిని నిర్బంధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కో రైతుకు మూడు బస్తాల యూరియా ఇవ్వాలని, ఒక బస్తా ఇస్తే ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. యూరియా కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకుని కార్యాలయ షెట్టర్‌ను తీశారు. రైతులు సంయమనం పాటించాలని సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. ఆ తర్వాత రైతులకు ఒక్కో యూరియా బస్తా చొప్పున పంపిణీ చేశారు. సొసైటీ కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడుతూ రోజుకు 40 టన్నుల యూరియా అవసరమని ఇండెంట్‌ పెట్టామని, 10 టన్నులు మాత్రమే వస్తుండటంతో ప్రతీ రైతుకు ఒక్కో బస్తా చొప్పున ఇస్తున్నామని తెలిపారు.



పీఏసీఎస్‌ షెట్టర్‌ మూసి ఆందోళన చేస్తున్న రైతులు

క్లుప్తంగా

తాలిపేరుకు వరద ఉధృతి



తేగడలోని తాలిపేరు హైలెవల్ వంతెన వద్ద గోదావరి బ్యాక్‌వాటర్ ఉధృతి

చర్ల: తాలిపేరు ప్రాజెక్ట్‌లోకి వరద నీటి ప్రవాహం ఒక రోజు పెరుగుతుండగా, మరో రోజు తగ్గుతోంది. వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంటోంది. బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రాజెక్ట్‌లో భారీగా వరదనీరు వస్తుండటంతో 14 గేట్లను ఎత్తి ఉంచి 30,054 క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. దీంతో దిగువన ఉన్న తాలిపేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మరోవైపు గోదావరిలో కూడా వరద ఉధృతి ఉండగా, బ్యాక్ వాటర్‌తో తేగడలోని హైలెవల్ వంతెన వద్ద వరద ఉగ్రరూపం దాల్చుతోంది.

కిన్నెరసాని ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షానికి కిన్నెరసాని జలాశయానికి వరద ఉధృతి పెరిగింది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 1,700 క్యూసెక్కుల వరదనీరు వస్తోంది. దీంతో బుధవారం నీటిమట్టం 405.30 అడుగులకు పెరిగింది. ప్రాజెక్ట్ ఒక గేటు ఎత్తి ఉంచి 5 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

మణుగూరు టౌన్: కారు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పినపాక మండలానికి చెందిన కోడిరెక్కల సావిత్రి (55) మణుగూరు నుంచి భద్రాచలం వైపు ఆటోలో వెళ్తోంది. ఈ క్రమంలో తోగ్గూడెం శివారులో ఎదురుగా వచ్చిన కారు ఆటోను ఢీ కొట్టింది. దీంతో సావిత్రి రోడ్డుపై పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. అపస్మారక స్థితికి చేరిన ఆమెను 108 ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించా రు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంజిత్ తెలిపారు.

అటు సీత.. ఇటు రాధ!

ఇందిరమ్మ ఇంటి స్థలంపై వివాదం

బోనకల్: మండలంలోని రాపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి స్థల విషయమై వివాదం నెలకొనగా ఇరువర్గాలతో అధికారులు చర్చించారు. గతంలో కులవృత్తులతో జీవిస్తున్న పలువురికి ప్రభుత్వం స్థలాలు కేటాయించగా గ్రామంలో రాచకొండ సీతకు సైతం కేటాయించారు. కొన్నేళ్ల పాటు అక్కడే ఉన్న ఆమె మరో గ్రామానికి వెళ్లింది. దీంతో ఆమె బంధువైన రాచకొండ రాధకు ఇటీవల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో ఆ స్థలంలో ముగ్గులు పోశారు. గ్రామంలో నాయకులు రెండు వర్గాలుగా ఉండడంతో నిర్మాణం జరపొద్దని ఓ వర్గం, ఆ స్థలాన్ని రాచకొండ రాధ కొనుగోలు చేసిందని ఇంకో వర్గం వారు వాదించారు. ఈ విషయం జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి వెళ్లగా ఆమె నెల క్రితం పరిశీలించి వివాదం లేని స్థలంలోనే ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. దీంతో ఎస్‌ఐ పి.వెంకన్న, తహసీల్దార్ రమాదేవి బుధవారం ఇరు వర్గాలను పిలిచి విచారణ చేపట్టారు. గతంలో కొన్నాళ్లు ఉన్న రాచకొండ సీతను ఈనెల 6న పిలిపించే వరకు ఇరు వర్గాలు సమన్వయంతో ఉండాలని సూచించారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

వైరా: వైరా పాత ఎక్సైజ్ స్టేషన్ రోడ్డులో ఓ బాలికపై లైంగికదాడికి ప్రయత్నించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. కాలనీకి చెందిన ఓ బాలిక ఇంట్లో ఉండగా దుగ్గిరాల రత్తయ్య వెనుక నుంచి వెళ్లి లైంగికదాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఆ సమయాన బాలిక తండ్రి ఇంట్లోనే నిద్రిస్తున్నాడు. బాలిక కేకలు వేయడంతో రత్తయ్య పారిపోయాడు. కాగా బుధవారం పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ పి.రామారావు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,107

నిమజ్జనం.. జర భద్రం



గోదావరి తీరంలో విగ్రహాల నిమజ్జనానికి సిద్ధం చేసిన క్రేన్లు

- జాగ్రత్తలు పాటిస్తేనే క్షేమమంటున్న అధికారులు
- జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న గణేశ్ నిమజ్జనాలు
- భద్రాచలం గోదావరికి తరలిరానున్న వేలాది విగ్రహాలు
- 250 మందికి పైగా పోలీసులతో బందోబస్తు



సిబ్బందికి బాధ్యతలపై సూచనలిస్తున్న భద్రాచలం టౌన్ సీఐ నాగరాజు

భద్రాచలంఅర్బన్: జిల్లావ్యాప్తంగా వినాయకచవితి సంబరాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. విభిన్న రూపాల్లో కొలువుదీరిన ఆదిదేవుడిని భక్తులు పూజిస్తూ పరవశిస్తున్నారు. అయితే విగ్రహాలను నిమజ్జనం చేసే సందర్భంగా ఎలాంటి అపశ్రుతులు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని పోలీసులు, అధికారులు సూచిస్తున్నారు. నవరాత్రులు ప్రారంభమైన ఐదోరోజు నుంచే నిమజ్జన కార్యక్రమాలు సాగుతుండగా.. ఈ నెల 6న వేలాది విగ్రహాలను భద్రాచలం గోదావరి తీరానికి తీసుకురానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

డ్రైవర్ పాత్ర కీలకం..

నిమజ్జన శోభాయాత్రలో ప్రధానంగా ఆయా వినాయక ప్రతిమలను ఊరేగించే వాహనాల డ్రైవర్లు అనుభవజ్ఞులై ఉండాలి. పొరపాట్లు జరగకుండా ముందుగానే సదరు డ్రైవర్లకు పోలీసులతో పాటు ఉత్సవ కమిటీ నిర్వాహకులు సలహాలు, సూచనలు ఇవ్వాలి. రోడ్లపై గతుకులు, గుంతలు, స్పీడ్ బ్రేకర్ల వద్ద జాగ్రత్తగా నడపాలి. విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తతతో వ్యవహరించాలి. ప్రతిమ వద్ద ఎక్కువ మంది జనం లేకుండా చూసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి..

గణేశ్ నిమజ్జన శోభాయాత్ర కార్యక్రమంలో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలకు తగిన జాగ్రత్తలు చెప్పి బయటకు పంపాలి. నిమజ్జనానికి చిన్నారులను ఒంటరిగా పంపడం మంచిదికాదు. తెలిసిన వారితో లేదా కుటుంబ సభ్యులు తోడుగా ఉండేలా చూసుకోవాలి. శోభాయాత్రను చూసేందుకు ఎత్తుగా ఉన్న భవనాలు, రేకుల షెడ్లు, పాతభవనాలు ఎక్కినపుడు జాగ్రత్తగా ఉండాలి. ఇక నిమజ్జనం సందర్భంగా క్యూ పద్ధతి పాటించాలి. ఒక వాహనం తర్వాత ఇంకో వాహనం వెళితే ఎవరికీ ఇబ్బందులు ఉండవు. భక్తులకు సౌకర్యంగా ఉంటుంది. ఇక ప్రతిమలను చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల వద్ద నిమజ్జనం చేసే సమయాన జాగ్రత్తలు పాటించాలి. ఈత రాని వారు, పిల్లలు సహా ఎవరూ లోనికి వెళ్లకుండా సిబ్బందికి విగ్రహాలు అప్పగించాలి.

నిమజ్జనానికి భారీ బందోబస్తు

భద్రాచలం గోదావరిలో గణేశ్ నిమజ్జనం చేయనున్న ఘాట్ వద్ద భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కు మార్‌సింగ్ పర్యవేక్షణలో 250 మంది పోలీసులు అంతేకాక 15 మంది వైద్య బృందం (మూడు షిఫ్ట్‌లలో), ఒక 108 అంబులెన్సు, మరో లైఫ్ సపోర్ట్ ఎమర్జెన్సీ వాహనాన్ని సిద్ధంగా ఉంచారు. రెండు షిఫ్టులలో 36 మంది ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది, 10 మంది గ్రామ పంచాయతీ సిబ్బంది, అంతే కాకుండా 12 మంది గజ ఈతగాళ్లు, దేవస్థానం సిబ్బంది 24గంటల పాటు కూడా అందుబాటులో ఉండనున్నారు. నిమజ్జనానికి మూడు భారీ క్రేన్లతో పాటు జేసీబీలను అధికారులు అందుబాటులో ఉంచారు.

భక్తులు సహకరించాలి..



వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తులు అధికారుల సూచనల మేరకు నడుచుకోవాలి. ఏ నిబంధన అమలు చేస్తున్నా అది మీ భద్రత కోసమేనని గుర్తుంచుకోవాలి. నిమజ్జనంలో పాల్గొనే భక్తులు, కమిటీ సభ్యులు పోలీసులు సూచించిన రూట్ మ్యాప్ ద్వారానే రావాలి. ఏదైనా ఇబ్బంది ఉంటే డయల్ 100కి కాల్ చేయండి. తొందర పాటుతో ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దు.

-బి.రోహిత్ రాజు, ఎస్పీ

నిమజ్జనానికి భారీ బందోబస్తు..



భద్రాచలం గోదావరిలో జరగనున్న నిమజ్జనోత్సవంలో ఈ సారి ప్రత్యేకంగా 250 మంది పనిచేస్తున్నాం. ఎక్కడా వినాయకులు ఎక్కువ సేపు ఆగకుండా మా సిబ్బంది ముందుకు సాగనంపుతారు. ఎక్కడైనా ఇబ్బందులుంటే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి. ఆరుగురు సీఐలతో పాటు 15 మంది ఎస్‌ఐలు, 231 మంది సిబ్బందిని బందోబస్తుకు వినియోగిస్తున్నాం.

-విక్రాంత్ కుమార్‌సింగ్, ఏఎస్పీ, భద్రాచలం

ఆలస్యమే కలిసొచ్చింది!



జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం

- గత పంచాయతీ ఎన్నికల్లో లెక్కలు సమర్పించని 292 మంది
- వారందరిపైనా అనర్హత వేటేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- 2024 ఏప్రిల్‌తో ముగిసిన నిషేధిత కాలపరిమితి
- స్థానిక ఎన్నికల ఆలస్యంతో పోటీకి దక్కిన అవకాశం

చుంచుపల్లి: సకాలంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడం వేటు పడిన అభ్యర్థులకు మేలు చేసింది. ఇప్పుడు వారందరికీ తిరిగి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభించింది. గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బరిలో నిలిచిన పలువురు అభ్యర్థులు నిర్ణీత వ్యవధిలో తమ ఖర్చుల లెక్కలు సమర్పించలేదు. దీంతో వారిపై రాష్ట్ర ఎన్నికల సంఘం మూడేళ్లపాటు అనర్హత వేటు వేసింది. అయితే నిషేధ కాలపరిమితి ముగిసింది. దీంతోవేటు పడిన వారందరిలో ఇప్పుడు ఆశలు చిగురిస్తున్నాయి. మరోసారి ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

ఎన్నికలు సకాలంలో జరగక..

2019 జనవరిలో జిల్లాలోని 479 గ్రామ పంచాయతీలకు 4,232 వార్డులకు మూడు విడతలుగా ఎన్నికలు జరిగాయి. గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం గతేడాది ఫిబ్రవరి 1తో ముగిసింది. ఆ వెంటనే లోక్‌సభకు ఎన్నికలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారుల పాలనను అమల్లోకి తెచ్చింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం సైతం గతేడాది ఆగస్టు మొదటి వారంతో ముగియగా, పరిషత్‌లో కూడా స్పెషలాఫీసర్ల పాలనే కొనసాగిస్తోంది. అయితే సకాలంలో పంచాయతీలకు ఎన్నికలు జరిగితే జిల్లాలో అనర్హతకు గురైన అనేక మంది అభ్యర్థులు పోటీకి దూరమయ్యేవారు.

292 మందిపై అనర్హత వేటు

నూతన పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం 2019లో జనవరిలో 479 గ్రామ పంచాయతీలకు, మేలో 219 ఎంపీటీసీలు, 21 జెడ్పీటీసీ పదవులకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో పోటీపడిన అభ్యర్థులు ఫలితాలు వెలువడిన తర్వాత 45 రోజుల్లోగా తమ ప్రచారానికి ఎంత ఖర్చు చేశారో నిర్దేశిత నమూనాలో ఆయా ఎంపీడీఓ కార్యాలయాల్లో సమర్పించాలి. ఐదు వేల లోపు జనాభా కలిగిన పంచాయతీలో పోటీచేసే వార్డు సభ్యుడు రూ. 30,000 వరకు, సర్పంచ్ అభ్యర్థులు రూ.1,50,000 వరకు ఖర్చు చేయాలని, 5 వేలకు పైగా జనాభా కలిగిన గ్రామ పంచాయతీల్లో పోటీ చేసే వార్డు సభ్యులు రూ.50వేలు, సర్పంచ్ అభ్యర్థులు ప్రచారం నిమిత్తం రూ.2,50,000 వరకు ఖర్చు చేసుకునే వెసులుబాటును కల్పించారు. నిబంధనల ప్రకారం గెలిచిన, ఓడిన అభ్యర్థులు ఖర్చుల వివరాలను వెల్లడించాలి. ఇందులో కొందరు వార్డు సభ్యులు గెలిచినా నిర్లక్ష్యంతో అధికారులకు ఖర్చు ల వివరాలు సమర్పించలేదు. ఓడిపోయిన మరి కొందరు ఎన్నికల నిబంధనలను అతిక్రమించారు. ఆయా అభ్యర్థులకు ఈసీ పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందన లేదు. దీంతో ఎంపీడీఓలు సమర్పించిన నివేదికల ఆధారంగా ఎన్నికల సంఘం 2021 నవంబర్‌లో కొందరు అభ్యర్థులపై అనర్హత విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలో గెలిచిన 96 మంది అభ్యర్థులతోపాటు ఓడిపోయిన మరో 196 మంది.. మొత్తం 292 మంది అనర్హతకు గురయ్యారు. వీరిలో ములకలపల్లి మండలంలోనే 96 మంది వరకు అభ్యర్థులు గెలుపొందిన ఉన్నారు. కొందరు ఉపసర్పంచ్‌లు కూడా ఉండటం గమనార్హం. వీరంతా 2024 ఏప్రిల్ వరకు ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయడానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. గ్రామ పంచాయతీలకు ఎన్నికల నిర్వహణలో తీవ్ర జాప్యం జరగడంతో అనర్హత వేటు కాలపరిమితి ముగిసిపోయింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు ఈ నెలలో నిర్వహిస్తామని ప్రకటించడంతో వారు కూడా పోటీకి సిద్ధమవుతున్నారు.

కరెన్సీ గణపతి !

పాండురంగాపురంలో రూ.11 లక్షలతో అలంకరణ

మండల పరిధిలోని పాండురంగాపురం రామాలయ సెంటర్‌లో నెలకొల్పిన శ్రీ వరసిద్ధి వినాయక విగ్రహాన్ని బుధవారం రూ.11 లక్షల కరెన్సీ నోట్ల మాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆర్తిమల్ల శ్రీకాంత్, ఇలవాల భరత్‌రెడ్డి, దేవినేని పవన్, గుండా ఫణికిషోర్‌రెడ్డి, కోటి శ్రీకాంత్, విజయభాస్కర్, వంశీకృష్ణ, చందు పాల్గొన్నారు.

– పాల్వంచరూరల్



కరెన్సీ నోట్లతో గణనాథుడు

కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక



కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ప్రభాకర్‌రావు తదితరులు

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాకు చెందిన కార్మిక సంఘ నాయకుడు ఊకంటి ప్రభాకర్ రావు అనుచరులతో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కేటీఆర్ బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. మణుగూరు మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహరావు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జారె ఫ్లెక్సీ చించివేత

చంద్రుగొండ మండలంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ గృహాలను ప్రారంభించారు. బహిరంగ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రుగొండ నుంచి బహిరంగ సభకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఉన్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఫొటోపై గుర్తు తెలియని వ్యక్తులు కొందరు ఇంక్ చల్లారు. ఫ్లెక్సీని చించివేశారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



మిషన్ భగీరథ వాల్వ్‌లో పడి వ్యక్తి మృతి



వెంకన్న(ఫైల్)

కరకగూడెం: మిషన్ భగీ రథ స్కోర్ వాల్వ్‌లో పడి ఓ వ్యక్తి మృతి సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం .. అశ్వాపురం మండలం మల్లెలమడుగు ఎస్సీ కాలనీకి చెందిన వంగూరి వెంకన్న (43) కొద్ది రోజులుగా తాటిగూడెం గ్రామంలో ఉంటున్నాడు. కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి వంట సామాన్ల కోసం దుకాణానికి వెళ్తున్న సమయంలో ప్రధాన రహదారి పక్కన తెరుచుకుని ఉన్న మిషన్ భగీరథ స్కోర్ వాల్వ్‌లో పడిపోయాడు. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకన్న ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో తోటి కూలీలు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సోదరుడు రాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా మిషన్ భగీరథ స్కోర్ వాల్వ్‌ను అసంపూర్తిగా, సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

లారీ, బైక్ ఢీ : విద్యార్థి మృతి

పాల్వంచరూరల్: పాస్‌పోర్టు వెరిఫికేషన్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణంలో బీటెక్ విద్యార్థి మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన జర్పుల చరణ్(22) బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. హైదరాబాద్‌లో పాస్‌పోర్టు వెరిఫికేషన్‌కు వెళ్లేందుకు మంగళవారం అర్ధరాత్రి పాల్వంచ వెంగళరావుకాలనీలోని బంధువు పవన్ బైక్ తీసుకుని వెళ్తున్నాడు. అదే సమయంలో ములకలపల్లి వైపు వెళ్తున్న లారీ పాల్వంచ దమ్మపేట సెంటర్‌లో టర్నింగ్ తీసుకుంటోంది. ఈ క్రమంలో లారీ డ్రైవర్ ఇండికేటర్ ఇవ్వకపోవడంతో బైక్ ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలై చరణ్ మృతి చెందాడు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదుతో లారీ డ్రైవర్ ఉకే కళ్యాణ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

మహిళపై కుక్క దాడి



గాయపడ్డ పద్మ

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లాతండా డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీకి చెందిన బాదావత్ పద్మ(49) బుధవారం ఉదయం వాకిలి ఊడుస్తుండగా పిచ్చి కుక్క దాడి చేసింది. దీంతో ముఖంపై తీవ్ర గాయాలు కాగా, కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆమెను ఏపీ రాష్ట్రం గుంటూరు ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

బాలిక అదృశ్యం

పాల్వంచరూరల్: పదో తరగతి బాలిక అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలానికి చెందిన విద్యార్థిని(16) బుధవారం స్కూల్‌కు వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. పాఠశాలకు రాలేదని వాచ్‌మెన్ ద్వారా సమాచారం అందుకున్న తల్లిదండ్రులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ సురేశ్ అదృశ్యం కేసు నమోదు చేశారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



జైకుమార్ (ఫైల్)

కొత్తగూడెంటౌన్: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది ఓ వ్యక్తి బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు, బంధువుల కథనం ప్రకారం.. రామవరం పంజాబ్‌గడ్డ బస్తీకి చెందిన మైలారపు ప్రసాద్ కుమారుడు జైకుమార్ (23) మూడేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన అఖిల భార్గవిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో మార్కెటింగ్ విభాగంలో పని చేస్తూ భార్యతో కలిసి అక్కడే జీవనం సాగిస్తున్నాడు. కాగా ఏడాది క్రితం పుట్టింటికి వెళ్లిన అఖిల తిరిగి భర్తకు వద్దకు రాలేదు. పలుమార్లు కోరినా కాపురానికి రావడంతో జైకుమార్ మనోవేదనకు గురయ్యాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్యహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీపీటీఎఫ్ నాయకుడు నాగేశ్వరరావు మృతి

ఖమ్మంసహకారనగర్/ఖమ్మంఅర్బన్: టీపీటీఎఫ్ నాయకుడు రాయప్రోలు నాగేశ్వరరావు (59) బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు గుండెపోటు రావడంతో చికిత్స చేయిస్తుండగా కన్నుమూశారని సంఘం బాధ్యులు తెలిపారు. ప్రస్తుతం నాగేశ్వరరావు ఖమ్మం అర్బన్ మండలం మల్లెమడుగు ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడిగా విధు లు నిర్వర్తిస్తున్నారు. విద్యార్థి దశలోనే పీడీఎస్‌యూలో చేరిన ఆయన ఉపాధ్యాయుడిగా నియామకమయ్యాక ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్, తెలంగాణ ఏర్పడ్డాక తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్‌లో ఖమ్మం అర్బన్ మండలం ప్రధాన కార్యదర్శిగా, జిల్లా కౌన్సిలర్‌గా వ్యవహరించారు. నాగేశ్వరరావు మృతిపై టీపీటీఎఫ్ నాయకులు వి.మనోహర్‌రాజు, నాగిరెడ్డి సంతాపం తెలిపారు.

చంద్రుగొండలో సందడి



చంద్రుగొండ బహిరంగ సభకు వస్తున్న జనం

చంద్రుగొండ మండలంలోని బెండాలపాడులో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో, దామరచర్లలోని బహిరంగ సభాస్థలిలో, చంద్రుగొండలో సందడి నెలకొంది.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



చంద్రుగొండలో ట్రాఫిక్ జామ్..



ప్రజలతో సీఎం రేవంత్‌రెడ్డి కరచాలనం..



గ్రామదేవతకు కొబ్బరికాయ కొడుతున్న సీఎం



సభలో టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకుని తింటున్న మహిళలు

సాక్షి ఫ్యామిలీ
ఖమ్మం
గురువారం ॥ 4-9-2025



జాతీయ పోషకాహార వారోత్సవాలు

ఫుడ్ ఫర్ టీన్స్



పిల్లల విషయంలో పెద్దవారికి ఒక రకమైన ఆందోళన ఉంటే... కాస్త పెద్ద పిల్లల విషయంలో ఇంకో రకమైన ఇబ్బందులు ఉంటాయి. అంటే పదేళ్లు దాటి టీనేజ్‌లో ఉండే పిల్లల్లో మరికొన్ని సమస్యలు చూస్తుంటాం. ఈ రోజుల్లో అయితే టీనేజ్ పిల్లల్లో ఆందోళన, మానసిక ఒత్తిడి, అధికంగా కోపం, డిప్రెషన్ వంటివి తరచూ వింటున్నాం. వారు తినే ఆహారపు ప్రభావం మానసిక, శారీరక స్థితిపైన చూపుతుంది. అందుకని, టీనేజ్ పిల్లలున్న ఇంట్లో పోషకాహారం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలి.

13–19 ఏళ్ల మధ్య ఫిజికల్, మెంటల్ గ్రోత్ వేగంగా మార్పు చెందుతుంటుంది. ఇలాంటప్పుడు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి (ఐసిఎమ్ఆర్) కొన్ని సాధారణ సూచనలు చేసింది. వాటి ఆధారంగా పోషకాహారాన్ని ఈ వయసు పిల్లలకు సరైన మొత్తంలో ఇవ్వాలి. అలాగే, ఆ ఆహారం మనసుకు సంతృపినిచ్చేలా ఉండాలి.

టీనేజ్ పిల్లల బరువు, ఎత్తు, చేసే పనులు.. ఇవన్నీ దృష్టిలో నిపుణుల సలహాతో సమతుల ఆహారాన్ని ప్లాన్ చేసుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో కాకుండా రోజులో 5–6 సార్లు సమయాన్ని బట్టి పైన టేబుల్‌లో ఇచ్చిన హెల్దీ ప్లేట్‌ను తయారుచేసుకోవచ్చు.

బ్రేక్‌ఫాస్ట్
కప్పు గోధుమ ఉప్మా /దోసె – 2 / కిచిడీ – కప్పు / రాగి రొట్టె – 2 –3 / ఇడ్లీ – 2–3 + కప్పు సాంబార్ + ఉడికించిన గుడ్డు లేదా ఆమ్లేట్ + కొద్దిపాటి గింజలు.

ఉదయం స్నాక్స్
పండు (ఆపిల్ లేదా అరటి లేదా నారింజ) + కొద్దిగా డ్రైఫ్రూట్స్ / పల్లీ చిక్కీ / వేపిన శనగలు / వేయించిన అవిసెగింజలు / డ్రై ఫ్రూట్ బార్ / ఉడికించిన వేరుశెనగ

మధ్యాహ్న భోజనం
అన్నం – 1 కప్పు లేదా గోధుమ రొట్టె – 2–3 / తృణ ధాన్యాలు – 1 కప్పు + ఆకుకూరలు – 1 కప్పు + మిక్స్‌డ్ వెజిటబుల్స్ – 1 కప్పు + చికెన్ బ్రెస్ట్ – 100 గ్రా / గుడ్డు – 1 / పనీర్ – 100 గ్రా / చేప – 100–120 గ్రా. + పెరుగు – 1 కప్పు

సాయంత్రం స్నాక్స్
మొలకెత్తిన గింజలు, విత్తనాలు – 30 గ్రా + చియా సీడ్స్ + నిమ్మరసం/ పాలు/ పండు జ్యూస్ లేదా సూప్.

రాత్రి భోజనం
మధ్యాహ్న భోజనం మాదిరి గానే + గ్రిల్ చేసిన చికెన్ బ్రెస్ట్ అన్నంతో లేదా రొట్టెతో + కూరగాయలు + ఉడికించిన బ్రొకోలీ

కిలో కేలరీలు : అబ్బాయిలకు 2200-3200 : అమ్మాయిలకు 1800 - 2500
ప్రొటీన్లు : అబ్బాయిలకు - 52 గ్రా. : అమ్మాయిలకు - 46 గ్రా.
కొవ్వులు (Fat) : 25-35%
కార్బోహైడ్రేట్స్ : 45-65%
విటమిన్-ఎ : 600-900 మైక్రోగ్రాములు
విటమిన్ - సి : 45-75 మి.గ్రా
కాల్షియం : 1300 మి.గ్రా నీళ్లు - 8 నుంచి 12 గ్లాసులు



– డా. సుజాతా స్టీఫెన్, న్యూట్రిషనిస్ట్

ఫుడ్ గ్రూప్స్, పరిమాణం

ఏదైనా పండు	- 1 రోజుకు 2-3 సర్వింగ్స్
కూరగాయలు	- రోజుకు 3-5 సర్వింగ్స్ (ఉడికించినవి లేదా వండినవి)
ధాన్యంతో వండినవి	- రోజుకు 6 - 8 సర్వింగ్స్ (1 సర్వింగ్ - ½ కప్పు ఉడికిన అన్నం/సిరిధాన్యం/గోధుమ)
డెయిరీ ఉత్పత్తులు	- రోజుకు 2 - 3 కప్పులు (పాలు, పెరుగు, చీజ్ రూపంలో)
ఆరోగ్యకరమైన కొవ్వులు	- రోజుకు 1 టేబుల్ స్పూన్ (నూనె, గింజలు, విత్తనాలు మొదలైనవి)
ప్రొటీన్ ఆహారం	- మాంసం, గుడ్డు మొదలైనవి (1 సర్వింగ్)

● మన(సు)లో మాట

తీవ్ర మనోవ్యాధికి సంజీవని!

మేము కోయంబత్తూరులో సెటిల్ అయిన తెలుగు వాళ్లము. మా అబ్బాయి బీటెక్ తర్వాత ఎం. ఎస్. కోసం సంవత్సరం క్రితం అమెరికాకు వెళ్ళాడు. మొదట 6 నెలలు బాగానే ఉన్నాడు. తర్వాత అతని ఆలోచనలు, ప్రవర్తనలు మారాయి. అమెరికాలో ఉన్న పోలీసులు, గూఢాచారులు తనని వెంబడిస్తున్నారని తన మెదడు మీద, ఎలాన్ మస్క్, ట్రంప్ ప్రయోగాలు చేస్తున్నారని అనుమానంతో భయపడుతూ– ఉండేవాడు. ఆ ప్రవర్తన ఎక్కువై బాగా చికాకు చేస్తే అక్కడే ఉండే మా చుట్టాలు 6 నెలల క్రింద ఇండియాకు పంపించారు. ఎయిర్ పోర్టులో దిగాక నేరుగా చెన్నైలో ఒక ఆస్పత్రిలో అడ్మిట్ చేశాము. 'స్కిజోఫ్రినియా' లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని, బాగా అగ్రెసివ్‌గా, సూసైడల్ ఆలోచనలతో ఉన్నాడని అక్కడి డాక్టర్లు ఇ.సి.టి. ట్రీట్మెంట్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. మా ఫ్యామిలీ డాక్టర్‌ని అడిగితే ఆయన ఇ.సి.టి. వల్ల మెదడు దెబ్బతింటుంది, భవిషత్తులో ఇబ్బందులు వస్తాయని చెప్పారని, మేము ఆ ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేసి వేరే హాస్పిటల్‌కి తీసుకెళ్లాము. పెద్దగా ఫలితం కనిపించకపోయేసరికి ఇంగ్లీష్ వైద్యం కాకుండా వేరేవైద్యానికి వెళ్ళాము. చాలా రోజులు ఆ మందులు వాడినా ఎలాంటి మార్పూ లేదు. దయచేసి మాకు ఏదైనా మంచి దారి చూపగలరు.

- సోమలింగేశ్వరరావు, కోయంబత్తూరు

చాలామందిలో అంతర్గతంగా ఉండే ఇలాంటి సమస్యను సాక్షి ద్వారా తెలియజేసినందుకు మీకు నా అభినందనలు. మీ అబ్బాయికి వచ్చిన స్కిజోఫ్రీనియా వ్యాధి వలన ఎంతగా సంఘర్షణకి గురయ్యారో అర్థం అవుతోంది. ముందుగా మీరు అర్థం చేస్కోవాల్సింది, మెదడులో వచ్చే కొన్ని రసాయనిక మార్పుల వల్లనే ఇలాంటి మానసిక సమస్యలు వస్తాయని, అవి తగ్గాలంటే ఆ రసాయనాలని సాధారణ స్థితికి తీసుకురావాలనీ మానసిక వైద్యులు మొదటిగా మందులు, కౌన్సెలింగ్ ద్వారా మార్పులు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తారు.

అయితే కొన్నిసార్లు ఆ సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు లేదా పేషెంటుకి ఆత్మహత్య ఆలోచనలు, జబ్బువల్ల ఇతరులకు హాని చేసేంత ఆవేశం, కోపం, ఉన్నప్పుడు, మందులు పని చేయడానికి చాలా సమయం పట్టొచ్చు: అలాంటప్పుడు పేషెంటుకి కుటుంబ సభ్యులకి జరిగే నష్టం ఎక్కువ. దీన్ని నివారించడం కోసం అత్యంత వేగంగా. ప్రభావ వంతంగా పనిచేసే ఒక సంజీవని లాంటి వైద్య విధానమే' ఇ.సి.టి. ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపీ. అంతమంచి చికిత్స విధానాన్ని వాడుక భాషలో 'షాక్ ట్రీట్మెంట్' అంటారు. అదే అన్ని సమస్యలకి, అపోహలకి కారణం అయింది. దీనివల్ల మనిషికి ప్రాణహాని అని లేదా నరాలు చచ్చుబడి, సంసారానికి పనికి రారు అని అనేక అపోహలు, సాధారణ ప్రజలతో పాటు, కొంత మంది వైద్యుల్లో కూడా ఉన్నాయి. మన శరీరంలో ఇతర జ్ఞానేంద్రియాలు, కండరాలు ఇతర వ్యవస్థలన్నీ పనిచేయడానికి మెదడులో ఉత్పత్తి అయ్యే కరెంట్ చాలా ముఖ్యం. దాన్ని మార్చడం ద్వారా మెదడులోని రసాయనాల అసమతుల్యను కూడా సరి చేయవచ్చు. ఒక రకంగా చెప్పాలంటే ఫోన్ లేదా కంప్యూటర్ కి వైరస్ వచ్చి పని చేయకపోతే రీసెట్ ' బటన్ నొక్కి దాన్ని పనిచేసే కండిషన్‌కి ఎలా తీసుకు వస్తామో ఇ.సి.టి. కూడా మెదడుని అలాగే రీసెట్ చేస్తుంది. దీనివల్ల దీర్ఘకాలికంగా ఎలాంటి సమస్యలు వస్తాయని ఇప్పటి వరకు ఎలాంటి శాస్త్రీయ పరిశోధనా తేల్చలేదు. ఒక పేషెంట్ అన్ని రకాలుగా శారీరకంగా ఫిట్‌గా ఉంటేనే ఇ.సి.టి. చికిత్స చేస్తారు. మీ అబ్బాయిని పరీక్షించిన డాక్టరు అన్ని పరీక్షలు చేసి ఎలాంటి ఇబ్బంది లేకపోతేనే ఇ.సి.టి. ట్రీట్మెంట్ గురించి చెప్పి ఉంటారు. కాబట్టి ఎలాంటి అపోహలు, భయాలు లేకుండా చికిత్స ఇప్పించి, మీ వాడి జబ్బు లక్షణాలను తొందరగా తగ్గించుకోండి.

మీ అలాగే వాళ్ళు చెప్పినన్ని రోజులు మందులు వాడితే జబ్బు మళ్ళీ తిరిగబెట్టకుండా ఉంటుంది. ఆల్ ది బెస్ట్ !




డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన
మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● బయోపిక్

వెండితెరపై కశ్మీర్ కోయిల

మనకు ఎం.ఎస్. సుబ్బులక్ష్మి తెలుసు.
మహనీయ కర్నాటక సంగీత విద్వాంసురాలు.
లతా మంగేష్కర్ తెలుసు. సినీ సంగీతానికి రారాణి.
కాని రాజ్ బేగం తెలియదు.
ఆమె వీరిద్దరి కాలం నుంచే పాడుతోంది.
వీరితో సమానంగా కశ్మీర్ ప్రజల జేజేలు అందుకుంది.
కశ్మీర్ కోయిల బిరుదు అందుకుంది.
కాని ఆమె దేశానికి తెలియడానికి ఇంత కాలం పట్టింది.
అదికూడా ఇప్పుడు ఆమె జీవితం ఆధారంగా తీసిన 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్' సినిమా అమేజాన్‌లో విడుదల అయ్యాక.



1950ల కాలం ఊహించండి.

కశ్మీర్ పర్వత ప్రాంతం. అక్కడివన్నీ గిరిజన సంప్రదయాలు. కశ్మీర్‌కే తనదైన గొప్ప సంగీతం, గానం, వాయిద్యం, కవిత్వం, గీతం... ఉన్నాయి. అక్కడ కశ్మీరీ భాషలో ఎంతో మంచి సాహిత్యం ఉంది. కాని అక్కడ ఉర్దూ, హిందీ కూడా వాడుకలో ఉంది. నిరంతరం ఏదో ఒక అలజడికి లోనయిన ఆ ప్రాంతంలో స్త్రీలు ఏ పనిలో అయినా ముందుకు రావడం కష్టంగా ఉండేది. వారి కళ కూడా నాలుగ్గోడల మధ్యే తప్ప బహిరంగం కావడానికి లేదు.

ఈ నియమాన్ని బ్రేక్ చేసిన గాయని రాజ్‌బేగం.

1927లో శ్రీనగర్‌లో జన్మించిన రాజ్‌బేగం బాల్యంలోనే పాటను గ్రహించింది. అది అక్కడ కురిసే మంచులా ఆమెలో సహజంగా ఉద్భవించింది. గిరిజన గీతాలు, జానపద పాటలు పెళ్లిళ్లలో పాడటం మొదలు పెట్టింది. 1950లలో ఆమె మొదటిసారి ఆల్ ఇండియా రేడియో కశ్మీర్ స్టేషన్‌లో పాడింది. మరో నాలుగేళ్లకు అదే రేడియోలో స్టాఫర్ అయ్యింది. ఆ తర్వాత బహిరంగ వేదికల మీద పాడసాగింది. తన జీవిత కాలంలో కనీసం రెండు వేల పాటలు ఆమె పాడింది. అయితే దురదృష్టవశాత్తు ఏ పాట రికార్డింగూ అందుబాటులో లేదు. కశ్మీర్ సంగీతానికి ఆమె చేసిన సేవకు 2002లో 'పద్మశ్రీ' దక్కినా ఆమెకు రావాల్సిన ఖ్యాతి రాలేదు. 2016లో రాజ్ బేగం మరణించింది. జనం ఆమెను అక్కడ నిత్యం తలుచుకుంటూనే ఉంటారు. దేశానికి ఆమె పేరు చేరలేదు. కశ్మీర్‌లో పుట్టి పెరిగి అమెరికాలో చదువుకొని వచ్చిన అక్కడే స్థిరపడ్డ దర్శకుడు డానిష్ రెంజు ఆమె బయోపిక్‌ను తీసే అవకాశం పొందగలిగాడు. రాజ్ బేగం జీవితాన్ని, సంగీతాన్ని 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'గా తీశాడు. అమేజాన్‌లో ఆ సినిమా ఆగస్టు 29 నుంచి స్ట్రీమ్ అవుతూ విమర్శకుల ప్రశంసలు పొందుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ సంగీత అభిమానుల మెప్పు అందుకుంటోంది. దర్శకుడు ఫర్హాన్ అఖ్తర్ ఈ సినిమాకు ఒక నిర్మాత కావడం విశేషం.

***

'అమ్మా... దేవుడు స్త్రీలను పుట్టించింది కేవలం పెళ్లి కోసం కాదు' అని తన యవ్వన కాలం నుంచి తిరగబడుతూ తన దారిని నిర్మించుకుంటుంది రాజ్ బేగం 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్' సినిమాలో. పెళ్లిళ్లలో పాడుతూ గుర్తింపు పొందిన రాజ్ బేగం రేడియో కశ్మీర్‌లో ఆడిషన్ ఇవ్వడానికి వెళితే అక్కడంతా అబ్బాయిలే ఉండి 'నువ్వొచ్చావ్ ఏంటి' అన్నట్టుగా చూస్తారు. అయినా వారిని ఎదిరించి ఆడిషన్ ఇచ్చి ఎంపికవుతుంది రాజ్ బేగం. అయితే స్థానిక పరిస్థితుల దృష్ట్యా ఆమె తన సొంత పేరును చెప్పుకోవడానికి వీలుండదు. 'నూర్ బేగం' పేరుతో రేడియోలో పాడుతుంది. ఇది కొన్నాళ్లకు తెలిసి ఆమె ఊరి వాళ్లు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. ఆడపిల్ల ఇలా మగవాళ్లుండే చోటుకు వెళ్లి పాడటం ఏంటని రాళ్లతో కొడతారు. బహిరంగ వేదికల మీదకు రాకుండా చూస్తారు. రాజ్ బేగం ఇవన్నీ తట్టుకుని తన పాటను జనం వద్దకు తీసుకువెళుతుంది. ఏ జనమైతే ముందు వ్యతిరేకించారో వారంతా ఆమె అభిమానులుగా మారతారు. ఆమెను తమ ప్రాంతపు సాంస్కృతిక రాయబారిగా చేసుకుంటారు. ఆమె పాటలకు పరవశిస్తారు. తన జీవితంలో వేల కొలది పాటలు పాడి రాబోయే తరాలకు స్ఫూర్తినిచ్చింది రాజ్ బేగం. ఆమె వేసిన దారిలో ఇవాళ ఎందరో కశ్మీర్ గాయనులు పాటలు పాడుతున్నారు. రాజ్ ఎదుర్కొన్న వ్యతిరేకత వీరికి లేదు.



'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'లో యంగ్ రాజ్ బేగంగా సబా ఆజాద్, వృద్ధ రాజ్ బేగంగా సోని రాజ్‌దాన్ (ఆలియా భట్ తల్లి) నటించారు. సినిమా హిందీ భాషలో సాగినా పాటలు కశ్మీర్ సువాసనలతో ఉంటాయి. కశ్మీర్ జీవితం, సంప్రదాయాలు, మాటా, వరుస... అన్నీ ఈ సినిమాలో కనిపిస్తాయి.

ఇన్నాళ్లకు కశ్మీర్ సినిమా ఒకటి వచ్చింది.

అది ఒక గాయని గురించి కావడం సంతోషపడవలసిన సంగతి.

కళ మరణించదని మరో సారి నిరూపితమైంది.



● పద్మశ్రీ అందుకుంటున్న రాజ్ బేగం

● పేరెంటింగ్

ఒక హీరో గురించి...

పిల్లలకు ఎప్పుడూ బడి పాఠాలే కాదు బతుకు పాఠాలు, నైతిక విలువల గురించి కూడా చెప్పాలి. అదే నిజమైన పేరెంటింగ్. ఒక తండ్రి తన పిల్లాడికి సులువైన భాషలో మంచీచెడుల గురించి చెప్పిన మాటలు నెటిజనులకు తెగ నచ్చాయి.

ఫైనాన్షియల్ సర్వీసెస్ 'మైఫండ్‌బాక్స్' సీఈవో అనూజ్ పాల్...

'నీ గురించి స్కూల్‌లో ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా?' అని తన చిన్నారిని అడిగాడు.



'నేను ఒకరిని కొట్టాను' అన్నాడు అద్విక్.

'ఎవరిని కొట్టావు? ఎందుకు కొట్టావు?' అని అడిగిన తండ్రి... 'ఒక అమ్మాయిని అలా కొట్టవచ్చా?

నువ్వు ఆ అమ్మాయి వస్తువు లాగేసుకున్నావు. ఇతరుల వస్తువులు అలా లాక్కోవచ్చా? మీ క్లాస్‌మేట్స్ ఇద్దరు కలిసి నిన్ను కొట్టారనుకో, నీకు బాధగా అనిపించదా? వాళ్లు చేసింది తప్పు అనిపించదా... ఇది సరే, నువ్వు భవిష్యత్‌లో ఏం కావాలనుకుంటున్నావు? హీరో అవుతావా? విలన్ అవుతావా?' అని అడిగాడు అనూజ్.

'హీరో' అని జవాబు చెప్పాడు అద్విక్.

'తప్పు చేసినప్పుడు సారీ చెప్పేవారే నిజమైన హీరోలు. మరి నువ్వు సారీ చెబుతావా?' అని అడిగాడు తండ్రి. అద్విత్ ఆ అమ్మాయికి 'సారీ' చెప్పాడు! ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది.

● టెక్నో ఉమెన్

ఛాయా చిత్రం



'మెటా'లో దశాబ్దకాలం పాటు పనిచేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్పెషలిస్ట్ ఛాయ నాయక్ తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'ఓపెన్ ఏఐ'లో చేరింది. ఓపెన్ ఏఐలో ఆమె 'స్పెషల్ ఇనిషియేటివ్స్' టీమ్‌లో పనిచేయనుంది.

'సరియైన సమయంలో సరియైన నిర్ణయం' అని కంపెనీ మార్పు గురించి స్పందించింది ఛాయ. మహారాష్ట్రలోని పుణేకు చెందిన ఛాయ నాయక్ సెక్యూరిటీ, పీస్ స్టడీస్‌లో డిగ్రీ చేసింది. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో పబ్లిక్ పాలసీ, డాటా సైన్స్‌లో మాస్టర్స్ ప్రోగ్రామ్ చేసింది. పుణేలో 'పాత్‌వేస్ టు ఎంపవర్‌మెంట్'లో ప్రాజెక్ట్ మెనేజర్‌గా ఉద్యోగజీవితాన్ని ప్రారంభించింది. ఎన్విరాన్‌మెంటల్ సస్టెయినబిలిటీ కార్యాలయం(యూఎస్)లో జియోగ్రాఫిక్ ఇన్‌ఫర్‌మేషన్ స్పెషలిస్ట్‌గా పనిచేసింది. 'ది ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఫ్యూచర్'లో కన్సల్టెంట్‌గా, యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో గ్రాడ్యుయేట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసిన ఛాయ ఆ తరువాత డాటా–డ్రివన్, సోషల్ ఇంపాక్ట్ ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టింది. 'మెటా'లో 'డాటా ఫర్ ఇనిషియేటివ్' హెడ్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించింది. ఫేస్‌బుక్‌లో ఓపెన్ రీసెర్చ్ అండ్ ట్రాన్స్‌పరెన్సీ(ఫోర్ట్) హెడ్‌గా పనిచేసింది. 'ఓపెన్ ఏఐ'లోకి రావడానికి ముందు ఫేస్‌బుక్‌లో జనరేటివ్ ఏఐ ప్రాజెక్ట్ మెనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేసింది. 'మెటాలోని తొలి రోజులు నిన్నా మొన్నా జరిగినట్లే అనిపిస్తున్నాయి. మెటాలో పని చేసిన అనుభవం నా కెరీర్‌కు గట్టి పునాది వేసింది' అంటుంది ఛాయ. 'నా ప్రయాణం ఆగిపోలేదు. పుస్తకంలో ఒక పేజీని తిప్పాను. అంతే!' అని లింక్‌డ్ ఇన్ పోస్ట్‌లో కంపెనీ మార్పు గురించి రాసింది ఛాయానాయక్.

● డిజిటల్ అలర్ట్

అలా... ఆమె ప్రాణాలు కాపాడారు!



ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలికి చెందిన అమ్మాయి ఒకరు 'నేను ఆత్మహత్య చేసుకోబోతున్నాను' అని అర్ధరాత్రి దాటిన తరువాత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. 'మెటా' వెంటనే ఈ పోస్ట్‌ను స్టేట్ పోలీస్ మీడియా సెంటర్‌కు పంపి పోలీసులను అలర్ట్ చేసింది. కేవలం పదహారు నిమిషాల వ్యవధిలో ఒక సబ్–ఇన్‌స్పెక్టర్, కొందరు మహిళా పోలీసులు ఆ అమ్మాయి ఉన్న ఇంటికి చేరుకున్నారు. వాంతులు చేసుకున్న ఆ అమ్మాయి నిస్తేజంగా పడి ఉంది. వెంటనే ఆమెను హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు.

సమయానికి ఆస్పత్రికి తీసుకురావడం వల్ల ఆ అమ్మాయి చావు నుంచి బయటపడింది. ఆమె కోలుకున్న తరువాత... 'ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నావు?' అని అడిగితే... తాను ప్రేమించిన వ్యక్తి మాట్లాడడం మానేశాడని, తన ఫోన్ నంబర్ బ్లాక్ చేశాడని...ఇలా చెప్పుకుంటూ పోయింది.

పెరుగుతున్న ఆన్‌లైన్ సుసైడ్ అటెంప్ట్స్‌ను దృష్టిలో పెట్టుకొని ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు, మెటా భాగస్వామ్యంతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో సుసైడ్–రిలేటెడ్ పోస్ట్‌లపై నిఘా పెడుతున్నారు. వెంటనే రంగంలోకి దిగుతున్నారు. జనవరి 1, 2023 నుంచి ఆగస్ట్ 25, 2025 వరకు 1,315 మంది ప్రాణాలను కాపాడారు.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) సెప్టెంబర్ 3న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,06,810	1,08,950	1,06,970	1,08,950	1,07,200	1,06,960
బంగారం (22 క్యారెట్లు)	99,890	98,050	98,050	1,00,990	98,620	98,050
వెండి	1,27,000	1,26,300	1,37,000	1,26,300	1,26,000	1,37,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.